# క్రొత్త విసురం

శ్రీ. నడిమింటి గుంపస్వామి.

అత్త

"నిర్మలా! నిర్మలా! వచ్చి ఒక్కరోజైనా కూర్చోలేవూ! అల్లా ప్రతిసారు వీధి గుమ్మంలో నిలబడ కూడదమ్మా! లోకులు చూస్తే హర్షించరు. ఇంట్లోకొచ్చి, కూచో."

కోడలు

"అదేమిటత్తయ్యా! వీధి గుమ్మంలో నిలుచున్నంత మాత్రానే హర్షించకపోతే, మరి రోజూ సాయంకాలం షికారు అలవాటుంది నాకు. మరెల్లాగ——"

అత్త

"ఆ! ఏమిటీ! షికార్లు పోవుట అలవాటా! మొగాడిలా మాట్లాడుతున్నావేమిటి! అప్పుడే ప్రొద్దుట వచ్చేవో లేదో, అన్నీ అమర్యాదా పనులే చేయటానికి సిద్ధపడుతున్నావేం! ఎవరి హద్దులో వారుండాలి.- మొగాడు- బయటకు- ఆడది వంటింటికి అనాదిసిద్ధంగా ఆచారమైతే, నీవు దాన్ని రద్దుచేసి. మగాళ్లకు మల్లే వీధిలో తిరుగుతానంటావేం! లోకులు కాకుల వంటివారు! వాళ్ళ నోళ్లు కప్పగలమా!"

కోడలు

"(విసురుగా) అత్తయ్యా! నీవిల్లా తలుస్తే యెల్లా! నా చిన్నప్పుడు, చదువుకొనే యీడులో, మా క్లాసు కుర్రాళ్లతో కూడా షికార్లకెళ్ళేదాన్ని! ఈపాటి భాగ్యానికి మీరింత కూకలెయ్యాలా!"

అత్త

"అమ్మో! నీవింత దానివని నేనెరక్కపోయాను! లేకపోతే...మావాడికి...అబ్బ... పెళ్ళి చేయకే వుందును! కానీ! ఆ వెధవ చదువుచదివి మరేం మంచి పనులు నేర్చుకోలే! శృంగారించుకోటం, షికారు పోవటం, సినీమాలు చూడటం, పేపరు చదవడం——యివేగా——ఏం పెద్ద కార్యాలు చేసి, మమ్మల్ని ఉద్ధరిద్దామని——శక్తి తిరుగులకేగా!"

కోడలు

"మీకంతే తెలిసింది! నాలా మీకే చదువుకుంటే అల్లా మాట్లాడుతారా! తక్కిన దేశాల్లో-, చూడండీ- ఆడదానికంటే యెంత స్వాతంత్ర్యమో!——మన దేశంలోనో——ఇంట్లోవున్న ఈగకే నా స్వాతంత్ర్యం ఉంది కాని, మన ఆడవాళ్లకి నలుసంతేనా స్వేచ్ఛ వుందీ! ఏ వేనా అంటే మీరు చదువులని సణుగుతూ, లేనిపోని అపవాదు లల్లుతూంటారు!"

అత్త

"పైవాళ్లు వింటే అత్తగారు కోడరికం పెడుతున్న దంటారు! నువ్వీ వెఱ్ఱి-బొల్లి- అపభ్రంశపు తిరుగులు మాని, చిన్న పెద్ద తారతమ్యం తెల్సుకొని, యింట్లో కట్టినట్లుండాలె! ఎప్పుడో చిన్నప్పటిలా తిరుగుతానంటే, నేనొప్పుకున్నా, పైవారొప్పుకుంటారా! ముక్కుమీద వేలెట్టుకోని, ముచ్చట్లు నీమీద, నిన్నడ్డు పెట్టలేని మామీద, చెప్పుకోరూ! నీ హొయలు, నీనడకలు, లోకులు జూస్తే యేమనుకుంటారో తెల్సా——'ఇదేమిట్రా, సానిదానిలా, సిగ్గు, లజ్జలు లేకుండా సింగారించుకొని, సంచరిస్తున్నది'-అని. పోనీ అల్లా ఉంచు——శుభ్రంగా అత్తింటికి వచ్చేవుకదా- యింత పసుపు, కుంకుమ తెస్తారు కాని ఆ ఫేసు పౌడరు డబ్బీలా తేవటం!——సున్నం మెత్తుకున్నట్లు మెత్తుకోటమున్నూ-ఎవరకు అగుపడని బొట్టు, ఒంటినిండా సెంటు, పైటకు పిన్ను, జంపరు, దానిమీద చాలీ చాలని చంకల్లోకి పోయిన రవిక, కాళ్లకు చెప్పులు, కళ్లకు చత్వారం మనిషిలా జోడు, చేతికి వాచీ, చేతిలో పత్రికలూ పట్టుకొని, వీధిలోకి షికారు పోతానంటావుగదా!——నలుగురు చూచీ నవ్వుతారనేనా అనుకోవా!——పెద్దదాన్ని, అధవంవున్నదాని అని బుద్ధులు చెప్పతూవుంటే, నీ ధోరణే నీదా!——మానులో చేప పుట్టినట్లు, మనసులో మంచి బుద్ధులు పుట్టుకురావాలి! 'ఎంత చదువు చదివి ఏనీతి విన్నను' అన్న పద్యం ప్రకారం నడచుకుంటే యెల్లాగు! చిన్నపిల్లని, లోకజ్ఞానం సరిగా యెరగవి దానివని యింతవరకూ చెప్పేను——తర్వాత నీయిష్టం——"

కోడలు

"ఎవరి అలవాట్లు వారి వత్తయ్యా! మంచి బట్టకట్టుకుంటే తప్పా! పేపరు చదువుకుంటే తప్పా! షికారు పోతే తప్పా! క్లబ్బుకు పోయి, మన స్త్రీ సమాజానికుండే లోటుపాటుల గూర్చి మనలో (స్త్రీలలో, మన ఐకమత్యం, భావాల్లోని, సంభాషణల్లోని, చేసే కార్యాల్లోని, తుదకు ప్రతీవిషయంలో,ఉండాలని ఘంటాపదంగా, గాభరా లేకుండా లెక్చరిస్తే తప్పా! అదీగాక- దేశోద్ధారకులు- మతోద్ధారకులు- స్త్రీ స్వాతంత్ర్యాభిలాషులు-- మొదలైన మహాశయులచే నివ్వబడుచున్న లెక్చర్లకు హాజరయి, వింటే తప్పా! ఇవియా, తప్పులు- మీరెంచినవి——! చాలు——ఎంత సేపూ——చీపురుకట్టా, అలుగుడ్డా, అంట్ల సిబ్బి, వీటి ధాన్యమేనా! అందుచేతనే, మీలాంటి వారుండబట్టే, మన్నింకా అణుస్తున్నారు- మగవారు-! దైవానికి స్త్రీపురుషులందరూ సమానమేనా! లేకపోతే—— స్త్రీలబలలు, పురుషులు బలులు-! అని దేవుడు ఎక్కడయినా

చేయించాడా! మన పూర్వపురుషులు మంచి యెత్తెత్తి, ఆ కాలంలో ఉండే సోదర సోదరీమణుల అమాయక తత్వాన్ని గమనించి, వారిని లొంగదీసికొని,- స్త్రీలబలలు, పురుషులు బలులు- అని పురాణాల్లోని కెక్కించారు!—ఈ సంగతంతా- యీమధ్యను బయలుదేరిన పటాటోపము గాని, దేవునికందరూ, అన్ని విధాలా సమానులే! అతని దృష్టికి జాతిభేదములేదు! ఇన్ని మతాలు లేవు- అంతా ఏకత్వమే-! అయితే అప్పుడు వాళ్ళ హాయాం కలిగింది— ఇప్పుడు మన హాయాం వెలగాలి! తెలిసిందా అత్తయ్యా! మీరంచేత నావలె తయారయి, నాతో కూడా సంచరించాలని ప్రార్థన!

అత్త

"ఏమిటేమిటి గ్రుడ్డొచ్చి పిల్లను భ్రమింపజేసినట్లు, సిగ్గుమాలిన మాటలు మాటాడుతున్నావు!- పూర్వులంతా ఫుండాకోరులయినట్లు-, యిప్పటి మీ నవీన యువతీ సంఘమే మంచిదయినట్లు సూచిస్తున్నావా! ఇంకా నీవంటి యువతులకు, నాలాంటి ముసలివారు చెప్పిన మాటలు తలకెక్కవు! రక్తం క్రొత్త, అవయవాలు క్రొత్త- బట్టకట్టు క్రొత్త- మాటలు క్రొత్త- చేసే పనులు క్రొత్త- అన్నీ క్రొత్తే- మాలాంటి వాళ్లమో—ప్రాత—! క్రొత్తకీ, ప్రాతకీ ఎప్పుడూ జోడీలేదు—! అందుచేత యీ సమయంలో నేనేంచెప్పినా, శ్రావ్యంగా వుండదు! సంసార్లు, సన్యాసులు, సాన్లు అన్న విచక్షణ వుండాలావద్దా-! అందరూ ఒకటే వేషమా! వేలాం వెఱ్ఱిలా ఉండే మీ వ్యాపారాలు-! ఇదంతా ఒక్కత్తెరికే చెప్పేననుకుంటున్నావు! నీలాంటి వారందరకూ యిది అనువర్తిస్తుంది-! బాగా ఆలోచించుకో సంగతి సందర్భం- తలకు తగ్గట్టుగా ఉండాలి! కాని మితిమీరితే ముప్పు వాటిల్లుతుంది! మేముకూడా చిన్నప్పుడు, నీలాగే, మాటలు దొర్లించేం! కొంటె నేతలోమాటా వినిసేరు- పైవారికి కోత పుట్టించే పనులు చేయకూడదు!—ఒకరి మనసు నొప్పించకూడదు—తన మనస్సుకు నొప్పి కలుగజేసుకోరాదు- తెలిసిందా! కానీ యివన్నీ యీ సమయంలో యేకరు పెట్టడం అరణ్య రోదనమే! మునుపే ముక్కిడి, అందులో పడిశం అన్నట్లు— అసలు నీవు పట్నం పిల్లవు- అందులో చదువుకొన్నావు- మంచీచెడ్డా వేషభాషల్లోనే ఉన్నాయి—

కోడలు

"అయ్యో- అదేమిటండీ! మీరిల్లా మాట్లాడితే, మనం- మొదటినుంచి మగాళ్లచే నిరసనభావంగా చూడబడే మనం— ప్రస్తుతం యింటిలోనైనా స్వేచ్ఛా జీవనం లేని మనం- అజ్ఞానార్ణవములో నల్లల్లాడే మనం- ఉచ్ఛదశలోనికి, యెల్లా వస్తామత్తయ్యా! నిశ్చల మనస్సుతో, నిరంకుశాభిప్రాయాలతో, నైతిక సంభావణలతో స్వేచ్ఛా రంగంలో నెట్లా నాట్యము సల్పటకవకాశం చిక్కుతుంది? మనం పరాయి పురుషునితో మాట్లాడతామే అనుకోండి! అప్పుడే పాడులోకం అనుమానాలు! దురభిప్రాయాలు పడటమేనా! మానావమాన విచక్షణ యే హృదయానికైనా ఉండొద్దూ! ఎంతమాట నోటికివస్తే అంతే మాట అనేస్తూ వుండటమే! ఏమి వెఱ్ఱిబాగు ఆలోచనలు! ఎవరితో మాట్లాడితే, వారితో పోయినట్టేనా! స్త్రీలో కొన్నంత చుల్కన చేయటమేనా! వీధిలో తిరిగినంత మాత్రాన పురుషులతో సంభాషించినంతమాత్రాన, మనకుండే సహజ సౌందర్యాన్ని నవీనాలంకారములతో మెరుగుపెట్టినంతమాత్రాన,- అత్తయ్యా మీరిల్లా దురాలోచన చేస్తూయుంటే, మనం శాశ్వతంగా, దర్జాగా, సుఖంగా, ఒకరి ప్రాపేయం లేకుండా జీవించట మెల్లాజరుగుతుంది? మన ఉద్యమాలకు మనమే అడ్డువస్తే పురుషులాచ్చేరంటే తప్పా!"

అత్త

"మీ ఉద్యమాలు, మీ లెక్చర్లు, మీకుండే మనో నిశ్చయాలు, మీ వేషభాషలు అన్ని గమనించి విమర్శించి వున్నాను గనుకనే, నిన్నడ్డు పెడుతున్నాను. నిన్న లేదు మొన్న ముకుందంగాడి ముద్దుపెళ్లాం యిలాంటి లెక్చర్లు కొట్టే, పొరుగూరి కాంతంగాడితో లేచిపోయింది! పోకిరీ తిరుగులు, నెరవేరని నీలుగులూ, హద్దుమీరిన హాయాములు, ఆర్భాటపుటలంకారాలు, వల్ల ఆబలత్వం అంతరించేసి, శాశ్వత బలశాలినులై ప్రపంచాన్ని ఉద్ధరించేస్తారా! పురుషుణ్ని నిరశిస్తున్నారు గదా. ఒక్కరోజున యే మకామైనా వెళ్లి, యింటికి చేరకపోతే, గొంతుకలో పడిన వెలక్కా యిలా మీరు కొట్టుకుంటారెందుకు! మీ రెన్ని ప్రయత్నాలు చేసినా! పురుషులుకన్న మిన్నయని అనిపించుకోలేరు! పురుషులు, స్త్రీలు కలిస్తేనా లోకంఉంది! వారే సంసార రథానికి ఆధారము! జాగ్రత్తగా బుద్ధి తెచ్చుకొని మసులుకో!— ఇంకా- నీతో బాతాఖానీ వేస్తే అవతల పని యెల్లా నెరవేరుతుంది! నాకొడుకు వచ్చే వేళైంది! రా లోపలికిపోతున్నాను! నీయిష్టం—అయినా ఇప్పటి వాళ్ళతో మాట్లాడటమే కష్టం!

(అని లోనికిపోవును.)

నిర్మల లోలోన నవ్వుకొనుచు, అత్తగారు చాదస్తపు స్త్రీయని యెంచి, వయ్యారంగా తయారై, చేతితో పేపరు పట్టుకొని క్లబ్బుకి పోయింది!..............అత్తగారిది సనాతనపు ఫక్కీ......కోడలుది నూతన ఫక్కీ...అయితే నిర్మలది మేనరికం గనుక, అత్తగా రూరకున్నారు విచారిస్తూ.........

ఇల్లా రెండుసంవత్సరాలు గడిచేయి! నాటి నిర్మల యిప్పుడెలా వుంది! ఉయ్యాల్లో పిల్లాణ్ని పెట్టి ఊచుతూ, జోకొడుతూ వీధిలో కెళ్ళటానికే తీరుబాటు లేకుండా ఉంది! అంగ సౌష్టవం సన్నగిల్లింది. బట్టకట్టు బండల పాలయింది. క్లబ్బు లెక్చర్లు గంగలో కలిశాయి. వాల్లడలు మాయమయినాయి. కాలిజోళ్లు కుక్కల పాలయినాయి.....ఆర్భాటపుటలంకారాలన్నీ అంతరించాయి.........

ఎప్పుడూ పిల్లవాని సంరక్షణ, అత్తగారికి సహాయం, పతి పాదసేవ—వీనితో నిర్మలకు దినం గడచేది...

అప్పుడు నిర్మల ఆ ఫక్కీగా ఉండటానికి కారణం!.........